




వ్యవసాయ మార్కెట్ కమిటీకి వచ్చిన పత్తి దిగుబడులు

ప్రత్యక్ష అమ్మకాలకు తూట్లు

- దళారీ వ్యవస్థతో రైతులు దగా
- జిల్లా మార్కెట్ కమిటీల్లో అమలు కాని విధానం
- రైతులకు అవగాహన కల్పించని మార్కెటింగ్ శాఖ

కౌతాళం మండలం ఉరుకుంద గ్రామానికి చెందిన రామాంజినేయులు ఇటీవల ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని కమీషన్ ఏజెంట్ దుకాణానికి 12 క్వింటాళ్ల పత్తిని ఉంచారు. టెండర్ ద్వారా క్వింటాలు రూ. 7000 పలకగా రూ. 84,000 రావాల్సి ఉంది. ఇందులో రైతు తెచ్చిన పత్తిని అమ్మించినందుకు కమీషన్ ఏజెంట్ 2 శాతం కమీషన్ రూ.1,680, అదే రోజు అప్పటికప్పుడు నగదు చెల్లించాలంటే నూటికి రూ.2 లెక్క ప్రకారం రూ. 1,680 పట్టుకున్నారు. దీంతో పాటు హమాలీ కూలి డబ్బులు, తూకపు చార్జీలు, మహిళ కూలీ చార్జీలంటూ లెక్కించి రైతుకు రూ. 79,000 చేతిలో పెట్టారు. అంతేకాదు తాను పెట్టుబడి ఖర్చులకోసం ముందుగానే అప్పుగా రూ. 50వేలు దుకాణదారుడు దగ్గర తీసుకున్నారు. ఇలా అన్నీ పరిశీలిస్తే మార్కెట్ యార్డ్‌లో జరుగుతున్న లావాదేవీల కమీషన్ రూపేణా రూ. 10 లక్షలు కత్తిరింపు రూపంలో రైతులు దగాకు గురవుతున్నారు.

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ ఒక్కరైతే కాదు జిల్లాలో వ్యవస్థను రూపుమాపేందుకు ప్రభుత్వం నేరుగా వారి ప్రమేయం లేకుండా ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు వ్యాపారికే రైతు పండించిన పంటను నేరుగా అమ్ముకునేందుకు డైరెక్ట్ సేల్ ప్రత్యక్ష అమ్మకాన్ని తీసుకొని వచ్చింది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల మార్కెట్ యార్డులలో ఇది అమలు కావడం లేదు. ప్రత్యక్ష అమ్మకాలను ప్రోత్సహించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేశారు. రైతులు అవగాహన లేక తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. ప్రధానమైన మార్కెట్ యార్డులు ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు, నిత్యం ప్రతిరోజు పత్తి, వేరుశనగ, ఆముదం, కందులు, ఉల్లి, ఎండుమిర్చి వాము, మొక్కజొన్న పంట ఉత్పత్తులకు క్రయవిక్రయాలు జరుగుతాయి. జిల్లా రైతులే కాకుండా పక్క జిల్లా అనంతపురం, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా తాము పండించిన పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు వేలమంది రైతులు వస్తుంటారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏటా ప్రత్యక్షంగా రూ. 1600 కోట్లు, కర్నూలు రూ. 600 కోట్లు ఎమ్మిగనూరు రూ. 500 కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. ఇందులో ఒక శాతం సెస్సు రూపంలో మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూరుతుంది.



ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మూతపడ్డ ప్రత్యక్ష అమ్మకాల వేదిక

ప్రత్యక్ష అమ్మకాలపై అవగాహన ఏదీ?

ప్రభుత్వం రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది. మార్కెట్ యార్డ్‌లో ఉన్న దళారి వ్యాపారుల దగ్గరకు (కమీషన్ ఏజెంట్లు) వద్దకు వెళ్లకుండా నేరుగా రైతులు పండించిన పంట ఉత్పత్తులను వ్యాపారికే అమ్ముకునే వెసులుబాటును కల్పించింది. అదే ప్రత్యక్ష అమ్మకాలు (డైరెక్ట్ సేల్). ఇది ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ రైతులకు అధికారులు అవగాహన కల్పించకపోవడంతో అమ్ముకునేందుకు ఆసక్తి చూపడం లేదు. మార్కెట్ కమిటీల్లో కేవలం ప్రత్యక్ష అమ్మకాలు వేదిక అంటూ బోర్డులకే పరిమితం చేశారు. గత నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం డైరెక్ట్ సేల్‌ను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించింది. అప్పుడు హడావిడి చేసి కొంతమంది రైతులు ముందుకు రాక అటు వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపక ఈ విధానం అటకెక్కింది. దీంతో రైతులు దళారి కమీషన్ రూపంలో ఏటా రూ. లక్షల్లో నష్టపోతున్నారు. మరోవైపు రైతులు పంటల సాగుకు పెట్టుబడి ఖర్చుల కోసం (ఎరువులు, విత్తనాలు, పిచికారీ, మందులు, పొలం పనుల కూలీల కోసం) కమీషన్ ఏజెంట్ల వద్ద అప్పులు తీసుకుంటున్నారు. దీనివల్ల రైతులు ఎక్కడ అప్పులు వారు ఇవ్వరోనని భయంతో వ్యాపారికి నేరుగా అమ్ముకునేందుకు(ప్రత్యక్ష అమ్మకాలు) ముందుకు వచ్చేందుకు జంకుతున్నారు.



పంట ఉత్పత్తులకు తూకాలు వేస్తున్న హమాలీలు



వ్యాపారులు ముందుకు రావడం లేదు

మార్కెట్ యార్డులో ప్రత్యక్ష అమ్మకాలను జరిపేందుకు ప్రత్యేకమైన వేదిక ఏర్పాటు చేశాం. రైతులు నుంచి ప్రత్యక్ష అమ్మకాల ద్వారా కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రధానంగా రైతులకు కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లించాల్సి ఉంటుంది. అందువల్ల వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. రైతులు కమీషన్ ఏజెంట్ ద్వారా పెట్టుబడి ఖర్చుల కోసం అప్పులు తీసుకోవడం వల్ల నేరుగా వ్యాపారికే విక్రయించుకుంటున్నారు. రైతులకు యార్డ్‌లో మైకుల ద్వారా ప్రతిరోజు అవగాహన కల్పిస్తున్నాం. ఈ విధానం వల్ల రైతులు కమీషన్ లేకుండా నేరుగా అమ్ముకొని ఆర్థిక భారాన్ని కూడా తగ్గించుకోవచ్చు.

● గోవిందు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి, ఆదోని

జరుగుతున్నది ఇలా..

రైతు తాము పండించిన పంట అమ్మకం కోసం మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్ల దుకాణాల ముందు ఉంచుతారు. కమీషన్ ఏజెంట్ దుకాణం పేరు మీద వ్యాపారులు టెండర్ ధర నమోదు చేస్తారు. ఎవరు అధిక ధర నమోదు చేస్తే వారికి కేటాయిస్తారు. రైతు అమ్మకానికి తెచ్చిన దిగుబడి అమ్మి ఇచ్చినందుకు కమీషన్ ఏజెంట్ రైతు దగ్గర రెండు శాతం కమీషన్ వసూలు చేస్తారు. అప్పటికప్పుడు డబ్బులు చెల్లించాలంటే రూ. 100కు 2 శాతం కమీషన్ వసూలు చేస్తారు. దీంతోపాటు హమాలీ చార్జీలు, తూకపు చార్జీలు, ముందుగా సాగు పెట్టుబడి ఖర్చుల కోసం తీసుకున్న అప్పుకు వడ్డీ, ఇతరత్రా చార్జీలు మరో రెండు శాతం వరకు రైతుల నుంచి కత్తిరింపులు జరుగుతున్నాయి. ఇలాగా రైతులు దగాకు గురవుతున్నారు.

10 నుంచి టెట్

- పరీక్షకు హాజరు కానున్న అభ్యర్థులు 39,485 మంది
- పది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- డీఈవో శామ్యూల్‌పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు టెట్ పరీక్ష కొనసాగుతుందని డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టెట్‌కు జిల్లాలో 39,485 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం ఐదు సెంటర్లను ఏర్పాటు చేశామని, ఆదోని, ఎమ్మిగనూరు ఒక్కొక్కటి చొప్పున, కర్నూలులో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాదులో ఐదు పరీక్ష కేంద్రాలను అభ్యర్థులకు సిద్ధం చేశామని అన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలన్నారు. పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులకు ఏదైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. హెల్ప్ డెస్క్ నెంబర్లు 8121821266, 9032397231, 3603683182లను సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

- 3,960 మంది విద్యార్థులు హాజరు
- 164 మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎస్ఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక బీక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను డీఈవో శామ్యూల్‌పాల్ పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 4,124 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,960 మంది హాజరయ్యారు. 164 మంది విద్యార్థులు గైర్హాజరై జిల్లాలో 96 శాతం నమోదైనట్లు డీఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. కర్నూలులో 6, ఆదోనిలో 9, పత్తికొండలో 9 ఎగ్జామ్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి నెలా స్కాలర్‌షిప్ మంజూరవుతున్నట్లు ఆయన తెలిపారు.

మూడు నెలలుగా ఎదురుచూపులు

- కూలి డబ్బులు రాకపోవడంతో ఉపాధి కూలీల అవస్థలు
- గ్రామాల్లో నిలిచిపోయిన పనులు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో ముమ్మరంగా పనులు జరగాల్సి ఉంది. అయితే.. మూడు నెలలుగా ఆగస్టు నుంచి ఇప్పటి వరకు గ్రామాల్లో పనులు చేసిన రైతులు, రైతు కూలీలకు డబ్బులు ఇవ్వకపోవడంతో వారందరూ పస్తులతో అలమటిస్తున్నారు. మరో దారి లేక కుటుంబ సభ్యులతో బతుకు జీవుడా అంటూ దూర ప్రాంతాలకు వలసెళ్లిపోయి నానా కష్టాలు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో వేతనాల ఖర్చు రూ.278 కోట్లు

కర్నూలు జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.58లక్షల పనిదినాలు రైతులకు, రైతు కూలీలకు కల్పించాల్సి ఉండగా.. ఇప్పటి దాకా 50.51 లక్షల పనిదినాలను కల్పించారు. ఈ పనిదినాలకు సంబంధించి రూ.136.46 కోట్లు ఖర్చు చేశారు. జూలై వరకు సక్రమంగా పని చేసిన వారికి కూలి చెల్లించారు. ప్రస్తుతం ఆగస్టు నుంచి నవంబరు నెలాఖరు వరకు కర్నూలు జిల్లాలో రూ.2కోట్ల దాకా కూలీలకు వేతనాల రూపంలో చెల్లించాల్సి ఉందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 58లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా.. ఇప్పటికి 50.73 లక్షల దినాలను కల్పించినట్లు అధికారులు తెలిపారు. పని చేసినందుకు గానూ రూ.132.82 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కూలీలకు ఇంకా రెండున్నర కోట్లు చెల్లించాల్సి ఉంది. ఏకంగా మూడు నెలల పాటు కూలీ డబ్బులు అందకపోవడంతో గ్రామాల్లోని కూలీలు ఇతర పనుల కోసం వెతుకులాట మొదలెట్టారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం రబీ సీజన్‌లో వ్యవసాయ పనులు నామమాత్రంగానే జరుగుతుండటంతో కొత్త జీవనోపాధి కోసం పొట్ట చేతపట్టుకుని కూలీలు, రైతులు బతుకుజీవుడా అంటూ గుంటూరు, బెంగళూరు, హైదరాబాదు తదితర దూర ప్రాంతాలకు మిరప, తదితర పంటల పనుల కోసం వెళ్తున్నారు. కుటుంబం మొత్తం వలస వెళ్తుండడంతో గ్రామాల్లోని వీధులు నిర్మానుష్యంగా మారిపోయాయి. పత్తికొండ, పాణ్యం, మంత్రాలయం, ఆలూరు, డోన్ తదితర ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా వలస వెళ్తున్నారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి బకాయి నిధులను విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న నీటి కుంటలు, పండ్ల తోటల పెంపకం, ఇంకుడు గుంతలు, వాటర్‌షెడ్ ద్వారా చేపట్టిన తదితర పనులన్నీ నిలిచిపోయాయి. పెండింగ్ బకాయిలు ఇస్తేనే పనులు చేస్తామని కాంట్రాక్టర్లు భీష్మించుకున్నారు. ఇప్పటిదాకా ఉపాధి పనుల కోసం నంద్యాల జిల్లాలో సామాగ్రి ఖర్చు కింద రూ.64.67 కోట్లు వెచ్చించారు. కర్నూలు జిల్లాలో రూ.72.10 కోట్లు ఖర్చు చేశారు.

తొందరలోనే వేతనాలు చెల్లిస్తాం

కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు ఆగస్టు నుంచి వేతనాలు ఇవ్వలేదు. అదే విధంగా చేసిన పనులకు సంబంధించి రూ.20 కోట్ల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. వారం పది రోజుల్లో వేతనాలతో పాటు చేసిన పనులకు సంబంధించి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

● వెంకటరమణయ్య, డ్వామా పీడీ

ఉచిత శిక్షణ కోసం స్క్రీనింగ్ టెస్టు

డీబీసీ డబ్ల్యూవో ప్రసూన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీబీసీడబ్ల్యూవో ప్రసూన

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూపీపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల కోసం ఉచిత శిక్షణ పొందే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్‌లో ఆదివారం స్క్రీనింగ్ టెస్టు నిర్వహించినట్లు డీబీసీడబ్ల్యూవో ప్రసూన తెలిపారు. ఈపరీక్షకు కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి మొత్తం 69మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 48మంది కర్నూలుకు చెందిన వారు కాగా, 21మంది నంద్యాలకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. ఈ పరీక్షకు 57 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారు. ప్రశాంతంగా పరీక్ష జరిగినట్లు ఆమె తెలిపారు.

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

కల్లూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చేపట్టే కార్యక్రమాన్ని డిస్కం పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 8977716661 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

నేడు జాబ్ మేళా

కర్నూలు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం మంత్రి టీజీ భరత్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ జాబ్‌మేళాను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఈజాబ్ మేళాకు హాజరు కావాలని, 19 కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని వివరించారు. అభ్యర్థులు తప్పనిసరిగా విద్యార్హత పత్రాలు జిరాక్స్ ఆధార్ కార్డు, రెండు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాల కోసం సెల్ నెంబర్ 6302929570కు సంప్రదించాలని ఆయన కోరారు.

పడిపోయిన కొత్తిమీర ధర

7

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

- రామానుజ జీయర్ స్వామిజీ, ఆదిత్య పరాశ్రీస్వామీజీ
- కోడుమూరులో భారీ ర్యాలీ
- తరలివచ్చిన హిందువులు

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

- రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

మంత్రాలయం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మఠం అతిథిగృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రోడ్లు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరంలో కోలాహలం నెలకొంది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు, పరిమళప్రసాదం వద్ద భక్తులతో సందడిగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపై ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యతో భక్తులు, గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు.



భక్తులతో కిక్కిరిసిన శ్రీమఠం ప్రాగణం

రమణీయం.. స్వర్ణ రథోత్సవం

- స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఆది దంపతుల స్వర్ణరథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున స్వామివారికి మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వార్చనలు చేసిన తరువాత భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామిఅమ్మవార్లకు ఆరుద్ర నక్షత్ర పూజలు చేశారు. గంగాధర మండపం రథశాల వద్ద స్వర్ణరథంపై ఆసీనులై ఉన్న స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహించారు. గంగాధర మండపం నుంచి మొదలుకొని నంది మండపం వరకు తిరిగి నంది మండపం నుంచి గంగాధర మండపం వరకు స్వర్ణ రథోత్సవం కొనసాగింది. ఈవో శ్రీనివాసరావుతో పాటు పాలకమండలి సభ్యులు ఏవీ రమణ, గంగమ్మ, వెంకటేశ్వర్లు, ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి, అధికారులు పూజల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కోలాటాలు, సంప్రదాయ నృత్యాలు చేశారు. సాయంత్రం ఆలయంలో పుష్పాలంకరణ చేసిన పల్లకిపై ఆదిదంపతులను ఆసీనులచేసి వార పూజల అనంతరం ఆలయ ప్రదక్షిణగా పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు.



నందిమండపం వద్ద దర్శనం కోసం వేచిఉన్న భక్తులు

శివనామస్మరణతో..

శ్రీశైల క్షేత్రం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. మండల దీక్షలు విరమించుకునే శివస్వాములు.. శబరిమల యాత్రలో భాగంగా మల్లన్న దర్శనానికి వస్తున్న అయ్యప్ప స్వాములే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వస్తున్న యాత్రికులతో క్షేత్రమంతా ఆధ్యాత్మిక సందడితో నిండిపోయింది. స్పర్శ దర్శనాలు తాత్కాలికంగా నిలిపి వేసి అందరికీ అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నందున భక్తులు ఆలయ సిబ్బందితో సహకరించవలసిందిగా ఈవో కారారు. అతిశీఘ్ర దర్శనం టికెట్ భక్తులు ఉచిత లడ్డూ ప్రసాదాలను పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆలయ ప్రధాన మాడ వీధిలో సాగుతున్న స్వర్ణ రథోత్సవం

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

- రామానుజ జీయర్ స్వామిజీ, ఆదిత్య పరాశ్రీస్వామీజీ
- కోడుమూరులో భారీ ర్యాలీ
- తరలివచ్చిన హిందువులు


మాట్లాడుతున్నరామానుజ జీయర్ స్వామీజీ, ఆదిత్య పరాశ్రీస్వామీజీ

కోడుమూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం విశిష్టతను కాపాడడానికి హిందువులంతా కృషి చేయాలని రామానుజ జీయర్ స్వామీజీ, ఆదిత్య పరాశ్రీస్వామీజీ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన హిందూ సమ్మేళనకు సభకు వారు హాజరై సందేశం వినిపించారు. సనాతన హిందూ ధర్మానికి అనంత శక్తి ఉందన్నారు. ఈ సందర్భంగా రామానుజ జీయర్ స్వామీజీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భారతీయతత్వంలో మెలగాలని సూచించారు. పరమాత్ముడు అందించిన భగవద్గీత తప్పకుండా చదవాలన్నారు. ప్రతి రోజూ ఆలయ సందర్శనతో భక్తి, వినయం, విధేయత పెరుగుతుం దని, జ్ఞానం వికసిస్తుందన్నారు. ఆదిత్య పరాశ్రీస్వామీజీ మాట్లాడు తూ హిందువులు ఏమతానికి వ్యతిరేకం కాదన్నారు. ఎవరి మతం వారు ఆచరించుకోవచ్చన్నారు. అదే సమయంలో ఇతర మత విశ్వాసాలపై వ్యతిరేక భావనలు చేయవద్దన్నారు. ప్రస్తుత సమాజంలో హిందువులు ఐక్యతగా మెలగాలని, కులాల పేరుతో కుంపట్లు పెట్టుకోవద్దన్నారు. లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం అత్యద్భుతమని స్వామీజీలు కితాబునిచ్చారు. ఆలయ నిర్మాణ శైలిని ఛైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి వివరించారు. ఆలయ నిర్మాణానికి ప్రతి హిందువు తోడ్పాడు అందించాలని సూచించారు. ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరవుతామని ఛైర్మన్‌కు వారు హామీ ఇచ్చారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, కేవీఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పార్వతమ్మ, బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, కిరణ్, ఎద్దుల సూర్యారెడ్డి, వేణుగోపాల్, ఎద్దుల సత్యారెడ్డి, దామోదర్, వెంకట స్వామి, గంగాధర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహాపాదయాత్రతో పరవశించిన జనం

హిందూ సమ్మేళన సభను పురస్కరించుకుని మహా పాదయాత్ర చేపట్టారు. హిందూ సమ్మేళన సమితి, ఆలయాల కమిటీ, లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భారీగా జనం తరలివచ్చారు. విశిష్టఅతిథులుగా హాజరైన స్వామిజీలకు ఛైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామాలయంలో పూజలు నిర్వహించిన స్వామిజీలు, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డితో కలిసి మహా పాదయాత్రలో పాల్గొన్నారు.

జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగింది

రామాలయం నుంచి లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం వరకు కోలాటాలు, డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య పాదయాత్ర జైశ్రీరామ్ నినాదాలతో సాగింది. ఆలయ ఛైర్మన్ మహేశ్వరరెడ్డి ఉత్సాహంగా డప్పు కొట్టారు. యువత కాషాయ జెండాలను పట్టి నృత్యాలు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.


పాల్గొన్న భక్తులు

శ్మశానం కోసం ఎకరా భూమి విరాళం

- ఎన్నికల హామీలో భాగంగా అందజేసిన ఎంపీటీసీ


భూమి పత్రాలు అందజేస్తున్న ప్రహ్లాదరెడ్డి

హాలహర్వి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారపల్లి గ్రామానికి చెందిన మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, ఎంపీటీసీ ప్రహ్లాదరెడ్డి ఊరి శ్మశానం కోసం ఒక ఎకరా పొలాన్ని ఉచితంగా దానం ఇచ్చి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం భూమి పత్రాలను గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గత ఎంపీటీసీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గ్రామస్థులకు అందజేసినట్లు తెలిపారు. 11వ సర్వే నంబర్‌లో గ్రామస్థులు అన్ని మతాల వారు శ్మశానంగా వాడుకోవచ్చన్నారు. పచ్చార పల్లి, బాపురం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

పరుగు పందెంలో విద్యార్థికి స్వర్ణ పతకం


జాతీయ స్థాయి పరుగుపందెంలో గోల్డు మెడల్ సాధించిన వెంకటరామిరెడ్డి

ఎమ్మిగనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల జైపూర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో నందవరం మండలం హాలహర్వికి చెందిన విద్యార్థి వెంకటరామిరెడ్డి 800 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించాడు. అతడు ప్రస్తుతం డిగ్రీ (బీబీఎం) గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో చదువుతున్నాడు. ఆదివారం ఎమ్మిగనూరుకు వచ్చిన విద్యార్థి వెంకటరామి రెడ్డిని కోచ్ మల్లికార్జున, క్రీడాకారులు అభినందించారు. ఈ సందర్భంగా వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ కోచ్ ప్రోత్సాహంతోనే జాతీయ స్థాయిలో రాణించానన్నారు. రాబోయే ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని దేశానికి పేరు తీసురావాలన్నదే తన కోరిక అన్నారు.

భార్యపై భర్త దాడి.. కేసు నమోదు

కొలిమిగుండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త, అతడి బంధువులు దాడిచేసినట్లు సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. మండలంలోని ఉమ్మాయిపల్లెకి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి, సుధారాణి భార్యాభర్తలు. వీరి మధ్య వివాదాలు నెలకొన్న నేపథ్యంలో సుధారాణి కొంతకాలంగా పుట్టినిల్లు అయిన ఆళ్లగడ్డలో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో గతనెల 28వ తేదీన భర్త వద్ద ఉన్న చిన్నకుమారుడిని తీసుకెళ్లడానికి వచ్చింది. ఈ క్రమంలో భర్త, మరికొంత మంది బంధువులు ఆమెపై దాడి చేశారు. ఈక్రమంలో ఆదివారం బాధితురాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఓంకార క్షేత్రంలో న్యాయాధికారి పూజలు


ఓంకారంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి

బండిఆత్మకూరు డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఓంకారంలో వెలసిన గంగా ఉమా సమేత సిద్ధేశ్వర స్వామిని నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్ తంగమణి దర్శించుకున్నారు. ఆదివారం క్షేత్రానికి వచ్చిన న్యాయాధికారికి ఆలయ కమిటీ ఛైర్మన్ చెన్నారెడ్డి, అర్చకులు చక్రపాణిశర్మ, మృగపణిశర్మ పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు, పూజలు చేశారు. ఆలయ మంటపంలో ఆమెను సత్కరించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

- ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేర చరిత్ర కలిగిన వారు నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా ఉండాలని ఎస్పీ సునీల్ షెరాన్ సూచించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న పనులు, జీవన విధానం అడిగి తెలుసుకున్నారు. నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. పోలీసులు చెప్పినట్లు మంచి మార్గంలో నడవాలని లేని పక్షంలో ఎక్కడైనా నేరాల్లో పాల్గొన్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

రైలు కింద పడి కర్ణాటక వాసి ఆత్మహత్య

కోసిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కోసిగి రైల్వేస్టేషన్ సమీపంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ఆరోలి గ్రామానికి చెందిన తిమ్మప్ప (45) అనే వ్యక్తి కోసిగి రైల్వేస్టేషన్ సమీపంలో 16577 అనే బెంగళూరు - బీదర్ వెళ్తున్న స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మంత్రాలయం ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ పి.నరసింహమూర్తి, హెడ్ కానిస్టేబుల్ శివరామయ్య తెలిపిన వివరాల మేరకు గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మా కడుపు కొట్టొద్దు

- పరిహారం అందకపోతే ఆత్మహత్యలే శరణ్యం
- ఉప్పలపాడు రైతులు


పట్టాలు చూపుతున్న బాధిత రైతులు

ఓర్వకల్లు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూములు కోల్పోయిన తమ కడుపు కొట్టొద్దు అని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి రైతులు మొర పెట్టుకున్నారు. ఆదివారం ఓర్వకల్లులో ఉప్పలపాడుకు చెందిన 23మంది దళిత రైతులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన 23 మంది రైతులు డీఆర్‌డీవోలో భూములు కోల్పోయారన్నారు. ఆ రైతులకు నష్టపరిహారం అందకుండా కాటసాని రాంభూపాల్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పాలకొలను పొలిమేరలో ఏళ్ల తరబడి భూములు సాగు చేసుకుంటున్నామన్నారు. ఆ భూములు సాగులో ఉన్నప్పటికీ నష్టపరిహారం ఇవ్వకపోవడంతో 2018లో పాలకొలనుకి చెందిన సుధాకర్‌రెడ్డి హైకోర్టులో కేసు వేశారన్నారు. ఈ మేరకు హైకోర్టు ఆర్డీవో, తహసీల్దార్, కలెక్టర్‌కు నష్టపరిహారం ఇవ్వాలని ఆర్డర్ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం 23మంది అర్హులని, వారికి రూ.5.24కోట్లు డబ్బులు మంజూరు చేశారన్నారు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి 23 మంది రైతులు అనర్హులని కలెక్టర్‌కు స్వయంగా ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. పేదలకు సాయం చేయాల్సిందిపోయి పరిహారం రాకుండా అడ్డుపడటం తగదన్నారు. తమకు నష్టపరిహారం అందకపోతే పురుగుమందు ఆత్మహత్య చేసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య, ఏసేపు, బోడన్న, రామదాసు, సుంకులమ్మ, ప్రభాకర్, ఫక్కీరయ్య, అనంతమ్మ, శేషమ్మ, మద్దమ్మ, గుండమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

ఏఎంసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా హరిబాబు


హరిబాబును అభినందిస్తున్న వివిధ మార్కెట్‌యార్డుల ఛైర్మన్లు

నంద్యాల ఎడ్యుకేషన్/ నంద్యాల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ల (ఏఎంసీ) సంఘం అధ్యక్షుడిగా నంద్యాల మార్కెట్‌యార్డు ఛైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మంగళగిరిలో ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో 26 జిల్లాలకు చెందిన ఏఎంసీ ఛైర్మన్లు గుంటుపల్లి హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హరిబాబు మాట్లాడుతూ రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌యార్డు ఛైర్మన్లకు చెక్‌పవర్ ఇవ్వాలని, మార్కెట్‌యార్డుల నుంచి గ్రామీణ లింక్ రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు కొత్త గోదాములను నిర్మించేవిధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాన్, మంత్రులు నారాలోకేశ్, అచ్చెన్నాయుడు, ఎన్ఎండీ ఫరూక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

గౌరు కుటుంబాన్ని విమర్శిస్తే ఖబడ్దార్

- టీడీపీ నాయకులు


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు సీఎన్ సుధాకర్ రెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన తనయుడు శివనరసింహారెడ్డి తరుచూ ప్రెస్‌మీట్లు పెట్టి గౌరు కుటుంబంపై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదని, ఖబడ్దార్ అంటూ టీడీపీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఓర్వకల్లులోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. హుశేనాపురం సొసైటీ అధ్యక్షుడు చదువుల సుధాకర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్లమోహన్‌రెడ్డితో పాటు మరికొంత మంది నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే గౌరు చరిత చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కాటసాని, ఆయన తనయుడు అవాకులు, చివాకులు పేలుస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో భూకబ్జాలు, అక్రమ కేసులు, మట్టి మాఫియా చేసిన ఘనత మీదే అన్నారు. బహిరంగ చర్చకు సిద్ధమా అని, ఎక్కడికి రమ్మంటే అక్కడికి రావడానికి సిద్ధం అని సవాల్ విసిరారు. యువ నాయకుడు గౌరు జనార్ధన్‌రెడ్డి చదువుకుంటూ కార్యకర్తలకు సూచనలు చేస్తూ ఆదుకుంటున్నారని, కాటసాని శివనరసింహారెడ్డి గన్‌తో బెదిరించే ప్రయత్నాలు చేస్తే సహించే ప్రసక్తేలేదని హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకులు నాగేశ్వరరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, జీకే సుధాకర్, లక్ష్మీకాంతరెడ్డి, పుల్లారెడ్డి, చంద్ర పెద్దస్వామి, సూర రాజన్న, టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పడిపోయిన కొత్తిమీర ధర

- మడి రూ. 50


గోనెగండ్లలో సాగు చేసిన కొత్తి మీర పంట

గోనెగండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తిమీర ధర ఒక్కసారిగా పడిపోయింది. కొత్తిమీరను సాగుచేసిన రైతులు విలవిలలాడుతున్నారు. పది రోజుల్లో కొత్తి మీర మడి ధర రూ.800 నుంచి రూ.50కు పడిపోయింది. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర అమాంతంగా పడిపోవడంతో రైతులు, వ్యాపారులు సైతం ఉల్లిక్కి పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎమ్మిగనూరు డివిజన్‌లో చాలా మంది రైతులు తక్కువ కాలంలో పంట చేతికి అందుతుందనే కారణంగా కొత్తిమీరను సాగుచేశారు. దాదాపు 3000 ఎకరాలలో సాగు చేసినట్లు తెలుస్తుంది. ఎకరానికి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఒక ఎకరంలో 200 నుంచి 220 మడులు వేస్తారు. కేవలం మడి ధర రూ.50 పలుకుతుండటంతో కొంత మంది రైతులు ఈపంట వైపు కూడా చూడటం లేదు. గోనెగండ్ల మండలంలో ప్రస్తుతం బావులు, బోర్ల దగ్గర దాదాపు 1000 ఎకరాల్లో కొత్తిమీర పంటను సాగు చేశారు. పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదని రైతులు చెబుతున్నారు.

పొలాల్లోనే వదిలేశాను



ఎకరం పొలంలో కొత్తి మీర పంటను సాగు చేశా. పెట్టుబడి రూ. 30వేల వరకు ఖర్చు చేశా. పంట చేతికి వచ్చిందనుకుంటే ధర అమాంతంగా పడిపోయింది. పంటను కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. వారం క్రితం కొత్తిమీరను కొంటానన్న వ్యాపారి నేడు కనిపించడం లేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి.

- కబుల్, రైతు, గోనెగండ్ల

గుప్త నిధుల కోసం వేట


స్కానర్లు ఆధునిక పరికరాలతో తనిఖీలు చేస్తున్న కర్ణాటక వాసులు

కోసిగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగసనూరు సమీపంలోని తిప్పన్నతాత మఠం వద్ద మల్లికార్జునస్వామి దేవాలయం ముందు గుప్త నిధుల కోసం వేట కొనసాగింది. ఆదివారం కర్ణాటకకు చెందిన నలుగురు వ్యక్తులు మెటల్ డిటెక్టర్లు, స్కానర్లతో గుప్తనిధులు పరిశీలిస్తుండగా గ్రామానికి చెందిన నగేష్ అనే వ్యక్తి వారిని చూసి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడు. గ్రామస్థులకు సమాచారం అందించాడు. దీంతో వేటగాళ్లు తమ తెచ్చిన స్కానర్లు, మెటల్ డిటెక్టర్లను తీసుకొని కారులో పరారయ్యారు. గతంలో కర్ణాటక వాసులు తుంగభద్ర నది సమీపంలో పురాతన ఆలయాల్లో గుప్త నిధుల కోసం తనిఖీలు చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. వేటగాళ్లు కర్ణాటకలోని రాజోలి, జూకురు చెందినవారై ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక వాసులు గుప్త నిధుల కోసం గ్రామానికి రావడంతో అగసనూరు వాసులు ఆగ్రహించారు. ఇదే విషయాన్ని ఎస్ఐ రమేష్‌రెడ్డిని వివరణ కోరగా.. విచారణ చేస్తామని, వారిపై చర్యలు తీసుకుంటామని, గుప్త నిధుల కోసం పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కుమ్మరులు రాజకీయాల్లో రాణించాలి


మాట్లాడుతున్న రవీంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ పుల్లయ్య

కర్నూలు ఎడ్యుకేషన్/కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుమ్మరులు తమ పిల్లలను విద్యావంతులను చేసి ఆర్థికంగానూ, సామాజికంగానూ, రాజకీయంగానూ రాణించాలని రవీంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ వ్యవస్థాపకుడు గూడూరు పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక నంద్యాల రోడ్డులోని సిరీ మెగా ఫంక్షన్ హాలులో కుమ్మరుల శాలివాహన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలకతీతంగా తమ సత్తా చాటాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కేసీ నాగన్న, జిల్లా కార్యదర్శిగా రమేష్, జిల్లా కోశాధికారిగా వెంకటేశ్వర్లు, నగర సలహాదారులుగా వెంకటేశ్వర్లు, నగర గౌరవ సలహాదారులుగా లింగన్న, నగర అధ్యక్షుడిగా మధు, కార్యదర్శిగా గుమ్మకొండ రమేష్, కోశాధికారి చిట్టిబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పీబీవీ సుబ్బయ్య, సుధాకర్, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, నరసింగ్‌బాబు, అసోసియేట్ అధ్యక్షులుగా పాండురంగస్వామి, గూడెంపాడు శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు సోమేష్, బజారప్ప, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాలివాహన ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని డిమాండ్ కుమ్మరులు, శాలివాహన సంఘం నాయకులు కోరారు. శాలివాహన కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు.

నేడు జీవో ప్రతుల దహనం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విత్తన, విద్యుత్ చట్టాలను నిరసిస్తూ సోమవారం బిల్లుల జీవో ప్రతులను దహనం చేయనున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం అన్నారు. ఆదివారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చాక వ్యవసాయం పై విరుచుకుపడి నష్టాల్లో ముంచతునారని విమర్శించారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధానాలను అవలంబిస్తున్నారని అన్నారు. జి.రామక్రిష్ణ, బి.వెంకటస్వామి, సుగ్గన్న, పోతుల శేఖర్ పాల్గొన్నారు.

హిమోగ్లోబిన్‌ను పరీక్షించుకోవాలి



విద్యార్థినులకు రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది

కర్నూలు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హిమోగ్లోబిన్‌ను పరీక్షించుకోవాలని క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.. ఆదివారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డా. ఎల్లాకృష్ణ ఆధ్వర్యంలో రక్తం గ్రూపు, హిమోగ్లోబిన్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ రక్తం గ్రూపునుహెచ్‌బీ స్థాయి తెలుసుకోవాలన్నారు. రక్తహీనత మహిళలు, పిల్లల్లో సాధారణంగా కనిపిస్తుందని, హాస్టల్ విద్యార్థుల కోసమే శిబిరం నిర్వహించామన్నారు. అధ్యాపకులు నాగరాజు శెట్టి, కె. రమేష్ బాబు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 104లో సేవలందిస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కేకే భవన్‌లో మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు కనీసవ వేతనం రూ.18,500కు పెంచాలని కోరారు. ప్రతి డివిజన్‌కు ఒక బఫర్ సిబ్బంది నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఇలియాజ్, మల్లికార్జున, జోజప్ప, ఈసన్న తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరల హక్కుల కోసం పోరాడతాం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉప్పరల హక్కుల కోసం పోరాడతామని సగరుల ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోనేబావి గోపాల్ పేర్కొన్నారు.


సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఆదివారం బీసీ భవన్‌లో సర్వసభ్య సమావేశం మాజీ జిల్లా అధ్యక్షుడు దూదేకొండ రాముడు, డా.గిడ్డయ్య అధ్యక్షతన నిర్వహించారు. నగరంలో భగీరథ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా గోనబావి గోపాల్, ప్రధాన కార్యదర్శి యుకే వీరేంద్ర, కోశాదికారిగా యు.రామాంజనేయులు ఎన్నికయ్యారు. సభ్యులను మాజీ అధ్యక్షుడు దూదేకొండ రాముడు, డా.గిడ్డయ్య సన్మానించారు.

క్రీడా దుస్తులు పంపిణీ


క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులకు ఆదివారం డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఉషూ సంఘం అధ్యక్షుడు బిజినేపల్లి సందీప్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. 8, 9 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించనున్న పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని జిల్లాకు పతకాలు తీసుకుని రావాలని తెలిపారు. మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో క్రీడాభివృద్ధి జరుగు తుందన్నారు.

ఒకేషనల్ ప్రిన్సిపాల్‌కు అవార్డు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ విజినరీ 2025 అవార్డును అందుకున్నారు. విద్యార్థుల్లో నైతిక, సాంస్కృతిక విలువలు పెంచేందుకు కృషి చేసినందుకు గానూ యూఎస్ఏ అమేజాన్ ప్రాడక్ట్ మేనేజర్ జీవీ రామమోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు.

పెద్దాసుపత్రిలో ప్రొస్టేట్ క్యాన్సర్‌కు ఉత్తమ వైద్యం


సదస్సులో పాల్గొన్న యూరాలజిస్టులు

- కేఎంసీ ప్రిన్సిపాల్ డా. చిట్టి నరసమ్మ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రొస్టేట్ క్యాన్సర్‌కు ఉత్తమ వైద్యం అందుబాటులో ఉందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా.కే.చిట్టినరసమ్మ, సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మెడికల్ కాలేజీ లెక్చరర్ గ్యాలరీలో యురాలజీ విభాగం ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వైద్యవిద్యలో నిరంతరం సాధన అవసరమన్నారు. ప్రొస్టేట్ క్యాన్సర్‌ను ప్రారంభం లోనే గుర్తించి చికిత్స అందిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. యురాలజీ విభాగాధిపతి డా.ముత్యశ్రీ మాట్లాడుతూ 60 ఏళ్ల దాటిన పురుషుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్ సాధారంగా మారిందని, సర్జరీ ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. యురో అంకాలజిస్టు డా.సేపూరి రవితేజ మాట్లాడుతూ ప్రొస్టేట్ క్యాన్సర్ ల్యాప్రొస్కోపీ ద్వారా రాయలసీమలోనే మొదటిసారిగా కర్నూలు జీజీహెచ్‌లో చేస్తామన్నారు. హైదరాబాదు అపోలో హాస్పిటల్ యురాలజిస్టు డా.సంజయ్ అడ్డాల, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శివప్రసాద్, సీనియర్ యురాలజిస్టులు డా.ఏవీఎస్ రెడ్డి, డా.సీతారామయ్య, డా.గోవిందరెడ్డి, పీజీలు పాల్గొన్నారు

మర్మమతు చేస్తే మేలు..

కొత్తబస్టాండు సమీపంలోని గణేష్ భవన్ హోటల్ వద్ద రద్దీగా గుంత పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయాల్సిన అధికారులు ఓ ప్లాస్టిక్ కోన్‌ను అడ్డంగా పెట్టారు. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ప్రధాన రహదారిని నిర్లక్ష్యం చేయడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్పందించాలని కోరుతున్నారు. **- కర్నూలు హాస్పిటల్.**



'ఉపాధి' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఎం చంద్రబాబుకు వినతి


సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాది హమీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం మంగళగిరిలో సీఎం చంద్రబాబుకు సంఘాల ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, వేతన పెంపుతో పాటు పలు సేవా సంబంధిత అంశాలపై సీఎంతో చర్చించామన్నారు. పరిశీలించి న్యాయం చేస్తామని సీఎం హమీ ఇచ్చారని తెలిపారు కంప్యూటర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రెడ్డప్ప, యు.తిరుమలేష్, పి.చలపతి, ఎం.ఈశ్వరరావు, కే.అరుణ, టీ.రవి, ఎం.చిన్ననాగన్న, రామాంజనేయులు, కిషోర్, రామక్రిష్ణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు


స్తంభాలను ఏర్పాటును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండ ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. స్తంభాల లేక పోవడంతో కాలనీ ప్రజల ఇబ్బందులను టీడీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి మూడురోజుల క్రితం కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరికి సమస్యను వివరించారు. వారు వెంటనే స్తంభాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ఎస్సీ కాలనీలో ఆదివారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.

సర్వే ఉద్యోగుల కార్యవర్గం

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రవీంద్ర వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా మద్దిలేటి, ఉపాధ్యక్షుడిగా నాగేంద్ర, సెక్రటరీగా విజయప్రకాష్, జాయింట్ సెక్రటరీగా కన్నా, ట్రెజరీగా రమేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రీంద్ర, ప్రణీత్, రాజ్‌కుమార్, అబ్దుల్ ఖాదర్, వేణుగోపాల్, నవీన్ కుమార ఎన్నికయ్యారు.హేమంత్ రెడ్డి, కలాం పాల్గొన్నారు.


ఎన్నికైన సభ్యులు

రచ్చబండ సేవా సమితి కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ స్వచ్ఛ భారత్ రచ్చబండ సేవా సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఎస్.నాగప్పవీధిలోని సమితి కార్యాలయంలో అధ్యక్షుడిగా వి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎం.రంగముని స్వామి, ఉపాధ్యక్షుడు ఎం.సత్యబాబు, కోశాధికారి బి.శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి వై.నరసింహులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.రాంబాబును ఎన్నుకున్నారు. అనంతరం పాతబస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహనికి నివాళి అర్పించారు.

ప్రజల సహకారంతోనే క్లీన్ అండ్ గ్రీన్ సిటీ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు సహకరిస్తే 'క్లీన్ అండ్ గ్రీన్' సిటీ సాధ్యమని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను శుభ్రం చేసి, మున్సిపల్ కార్యాకలాపాలకు వినియోగించుకునే విధానాన్ని ఈ నెల 14 నుంచి పున:ప్రారంభిస్తామన్నారు. ఖాళీ స్థలాల యజమానుల చిరునామా లేకపోవడంతో ప్రజల నుంచి విస్తున్న విజ్ఞప్తుల మేరకు ఈ నెల 14 వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. రహదారులపై జంతువులు, పశువుల సంచారాన్ని ఉపేక్షించేది లేదని, ప్రమాదాలు చోటు చేసుకుంటే యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ సమావేశ భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని, ప్రజలు సమస్యలను అర్జీల రూపం లో అందజేయాలన్నారు. పరిష్కార స్థితిని https:// meekosam. ap.gov. inలో తెలుసుకోవచ్చన్నారు.

12న అంగన్‌వాడీల సమ్మె

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీతాల పెంపు, గ్రాట్యూటీ సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లలిత ఆదివారం ప్రకటనలో తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొనాలని కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కర్నూలు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు, నేర చరిత్ర, చెడు నడత కలిగిన వారికి సీఐ, ఎస్‌లు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీస్ స్టేషన్లకు పిలిపించి, సత్ప్రవర్తనతో మెలగాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళా విద్య కోసం జీవితాంతం పోరాడిన సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకే ప్రకాష్‌రావు, జిల్లా అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్ కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. బాలిక పాఠశాలను ప్రారంభించి విద్యా ఉద్యమం చేశారని, ఆమె జయంతి జనవరి 3ను తెలంగాణ ప్రభుత్వం గతేడాది నుంచే మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగాప్రకటించిందన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం కార్యాలయలో వ్యవస్థాపక అధ్యక్షుడు పాపారావు, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడోసారి ఎన్నుకువారికి నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. రఘుబాబు, ఖాదర్, హుశేన్, గౌస్, రమేష్ ఉన్నారు.

ఐకమత్యంతో సాగితే నవ సమాజం

- సీఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ సంతోష్ ప్రసన్నరావు
- నగరంలో 'ఐక్య క్రిస్మస్' వేడుకలు


సన్మానించుకుంటున్న బిషప్‌లు


అకట్టుకున్న యాక్షన్ సాంగ్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐక్యమత్యంగా ముందుకు సాగి, నవసమాజాన్ని నిర్మిద్దామని సీఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ రైట్ రెవ. డాక్టర్ కె.సంతోష్ ప్రసన్నరావు ఉద్బోధించారు. ఆదివారం కోల్స్ కళాశాల మైదానంలో కర్నూలు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. యూపీసీఎంఏకేసీ చీఫ్ ప్యాట్రన్ రెవ. డాక్టర్ కేజే విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఆర్‌సీఎం బిషప్ మహాఘన జ్వాన్నేష్ హాజరయ్యారు. 2024 ఏళ్ల క్రితం క్రీస్తు జన్మించిన సందర్భాన్ని, ఆయన లక్ష్యాన్ని గుర్తు చేశారు. పేదలు, అనాథలను ఆదుకోవాలని, సేవాతత్పరత గుణాన్ని కలిగి ఉండాలని సూచించారు. పాస్టర్ షాలేం రాజు ఆధ్వర్యంలో పాడిన పాటలు అలరించాయి. పాస్టర్ కె. ప్రతాపరెడ్డి, సిటీ పాస్టర్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ రెవ. డాక్టర్ ఆర్ఆర్‌డీ సజీవరాజు, కేసీఈపీఏ చీఫ్ ప్యాట్రన్ రెవ. బోనాల శశికుమార్, హోసన్న మందిరం పాస్టర్ ఫ్రెడ్రిక్ పాల్, కర్నూలు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శామ్యూల్ రాజ్ పాల్గొన్నారు.

మ్యాన్ హోల్‌పై మూత

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్ సీఎస్ఐ చర్చి వద్ద మ్యాన్ హోల్‌ను నగర పాలక సంస్థ అధికారులు మూసి వేయించారు. నవంబరు 28న ఆంధ్రజ్యోతిలో 'కప్పెట్టేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు సిబ్బందిని పంపి మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేశారు.



మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన మూత

నటులకు స్ఫూర్తి మహానటి 'సావిత్రి'

- డీఈవో శామ్యూల్ పాల్


నివాళి అర్పిస్తున్న డీఈవో శామ్యూల్ పాల్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేటితరం నటులకు స్ఫూర్తిప్రదాత మహానటి సావిత్రి అని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, సావిత్రి 90వ జయంతి నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ సావిత్రి అభినయాన్ని మరెవ్వరూ అనుకరించ లేరని, సహజనటిగా తెలుగు, తమిళ చిత్రసీమలో రాణించారని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రాన్ని మరింత హంగులతో తీర్చిదిద్దుతున్నామని, కొత్తగా సౌండ్‌సిస్టమ్, కర్టెన్లు, లైటింగ్ సిస్టమ్‌లో మార్పులు చేసి, కొత్త వేదికను సిద్ధం చేశామని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు, కళాక్షేత్రం చైర్మన్ టీజీ వెంకటేశ్ సూచనల మేరకు కళాక్షేత్రాన్ని ఏసీ సౌండ్ ట్రాక్ సిస్టమ్స్‌తో కూడిన అత్యాధునిక థియేటర్‌లో చూసిన అనుభూతిని ప్రతి ప్రేక్షకుడు ఆస్వాదిస్తారని తెలిపారు.

సావిత్రి నటించిన చిత్రాల్లోని పాటలకు చిన్నారి సుదేష్ణ చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ ఇంద్రజాలికుడు కె. శివశంకర్ ప్రదర్శించిన మ్యాజిక్ షో, వెంట్రిలాక్విజమ్ అలరింప జేసింది. వ్యాఖ్యాత ఎస్ఎండీ ఇనాయతుల్లా, కళాకారులు మహ్మద్ మియా, పి. రాజారత్నం, కేవీ రమణ, గాండ్ల లక్ష్మన్న, యాగంటీశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


కలుసుకున్న 1999-20 బ్యాచ్ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

కల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కల్లూరులోని డైమండ్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం కలుసుకున్నారు. 25 ఏళ్ల అనంతరం కలుసుకోవడంతో నాటి మధుర జ్ఞాపకాలను తలుచుకున్నారు. ఉద్యోగాలు, బాధ్యతలు, కుటుంబాలతో బిజీగా ఉన్నా ఓసారి అందరం కలుద్దాం..అన్న మాటే వారందరినీ మళ్లీ కలిపింది. నాటి ఉపాధ్యా యులు తిప్పన్న, సలాంఖాన్, కృష్ణమూర్తి, గంగాధర్, హర్షవర్ధన్‌రెడ్డి, సుధాకర్, వెంకటరమణగౌడ్, ఎంఈవో సుబాషిణి పద్మజ, శ్రీలత, ధరిత్రీదేవి, రత్నారెడ్డి ఆశీర్వచనాలు అందించారు. హెచ్ఎం హుస్సేన్, డా.భారతి, పద్మరేఖ, ప్రొఫెసర్ పుష్ప, శశికళ, లావణ్య, ఉరుకుందు, పాపన్న, దేవరాజు ఉన్నారు.

ధ్యాన మందిరానికి ఎమ్మెల్యే కోట్ల విరాళం

కోడుమూరు రూరల్, డిసెంబరు 7, (ఆంధ్రజ్యోతి): అనుగొండ గ్రామంలో నిర్మిస్తున్న ధ్యాన మందిర నిర్మాణానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి రూ.50వేల విరాళ ఇచ్చారు. గ్రామ పెద్దలు ఆదివారం ఉదయం లద్దగిరిలోని నివాసంలో కోట్లను కలిశారు. పెద్దలు పద్మనాభరెడ్డి, బంకు గిడ్డయ్య, పాతపాటి శ్రీనివాసులు, చాకలి పెద్దకృష్ణ, పూజారి తంబలి గిడ్డయ్య పాల్గొన్నారు.


విరాళం ఇస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి


కలుసుకున్న ఫార్మా ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

ఫార్మా ఉద్యోగుల సమ్మేళనం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు, కుటుంబ సభ్యుల సమ్మేళనం ఆదివారం నగరంలోని కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. జాతీయ ఉపాధ్యక్షుడు సి.రామచంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి, ప్రధాన కార్యదర్శి .రామకృష్ణ పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఉన్న మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. కర్నూలు శాఖ అధ్యక్షులు సత్యనారాయణమ్మ, కార్యదర్శి రామాంజులురెడ్డి, కోశాధికారి రాంపుల్లయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హాకీ జూనియర్ వరల్డ్ కప్ పోటీలకు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో నిర్వహిస్తున్న హాకీ జూనియర్ వరల్డ్ కప్ పోటీలకు హాకీ ఆంధ్రప్రదేశ్ కర్నూలు కార్యదర్శి దాసరి సుదీర్ ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి కొద్ది మందికి మాత్రమే అవకాశం ఉన్న ఈ పోటీలకు ఆహ్వానం రావడంతో ఆదివారం కర్నూలు స్టేడియంలో ఆయనను సత్కరించారు. డీఎస్‌డీవో భూపతిరావు, క్రీడా సంఘాల ప్రతినిధులు రవికుమార్, సురేంద్ర చిన్న సుంకన్న, బాషా షేక్షావలి పాల్గొన్నారు.


హాకీ కార్యదర్శిని సన్మానిస్తున్న సభ్యులు

ఆయుర్వేదిక్ వైద్యశాలకు స్థలం ఇవ్వండి


ఎమ్మెల్యే కేఈకి వినతిపత్రం ఇస్తున్న అమర్నాథ్

తుగ్గలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):ఆయుర్వేదిక్ వైద్యశాలకు ప్రత్యేక భవనం లేక తాత్కాలిక వైద్యశాలతోనే సేవలు అందిస్తున్నామనీ ఆయుర్వేదిక్ వైద్యశాలకు స్థలం ఇచ్చి నూతన భవనం నిర్మించాలని వైద్యులు అమర్నాథ్ యాదవ్ పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కోరారు. ఆదివారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి సమస్యలు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే స్థలం ఏర్పాటు చేసి భవనం నిర్మిస్తామని తెలియజేశారన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి


పోస్టరు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరంలో ఈనెల 12నుంచి మూడు రోజుల పాటు జరిగే ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు సంజయ్ కోరారు. ఆదివారం రాష్ట్ర మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ వసతి గృహాలలో మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మహాసభలకు భారీగా విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. మణికంఠ, జగన్, ఉత్తేజ్, నాగరాజు, కార్తీక్, మహేష్ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

మద్దికెర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు చేసేవారంతా జాబ్కార్డుతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జాబ్కార్డు కలిగిన ఉపాధి కూలీల ఇళ్ల వద్దకు వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్కార్డులు పరిశీలించి వారికి ఈకేవైసీ చేయిస్తున్నారనీ అన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ఉపాధి హామీ పథకం ద్వారా ఎటువంటి లబ్ధి చేకూరదన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ఉద్యాన పంటలు రాయితీ కూడా లభించదనీ అన్నారు ఉపాధి కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని లేకపోతే వారికి పనులు కల్పించమన్నారు.

భక్తితోనే ముక్తి..

హలహర్వి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో ఆధ్యాత్మికత వల్ల ముక్తి లభిస్తుందని శ్రైలం పీఠాధిపతులు చెన్నసిద్ధరామ శివాచార్యులు అన్నారు. ఆదివారం జె.హొసళ్లి గ్రామంలో జరిగిన పల్లకి ఉత్సవం ఊరేగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉదయం మంది మహిళలకు ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పల్లకోత్సవం పాటు రాత్రి లక్ష దీపోత్సవం కార్యక్రమం కనువిందుగా జరిపారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతులు అజాత శంభులింగస్వామి సమక్షంలో జరిగింది.

స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి


స్పీడ్ బ్రేకర్ లేని రోడ్డు

మద్దికెర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలోని మద్దమ్మ దేవాలయం వద్ద గల ప్రాథమిక పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 70 మంది పిల్లలు చదువుకుంటున్నారని, నిత్యం ఆ ప్రాంతంలో ఆటోలు, ద్విచక్రవాహనాలతో రద్దీగాఉండటమే కాక ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. స్పీడు బ్రేకర్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయనీ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, పంచాయతీ, ఆర్అండ్బీ అధికారులు స్పందించి స్పీడ్బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులు బసవరాజు మాట్లాడుతూ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామని వారినుంచి స్పందన లేదని తెలిపారు..

దేవాలయ వ్యవస్థను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సహ ప్రాంత ప్రచారక్, జనార్దన్

ఆదోని టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హిందువులకు ఎంతో ప్రధానమైన దేవాలయ వ్యవస్థలను కాపాడుకోవడం ఎంతో అవసరమని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని భావసార భవన్లో జరిగిన హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. హిందూ స్వాభిమాన్ నిర్మాణం చేస్తూ, హిందూవులలో ఆత్మ విశ్వాసాన్ని నింపడం కోసం నిత్యం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా న్యాయవాది గిరిధర్ పాల్గొన్నారు. హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు బంగి అనంతయ్య, మరియాని చెన్న బసప్ప ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది

ఆర్థికసాయం

ఆదోని రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన బారికి నల్లన్న కుటుంబానికి కాంట్రాక్టర్ బసవరాజు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం అనారోగ్యంతో ఉన్న నల్లన్న ఆకస్మికంగా మృతి చెందాడు. బసవరాజు మృతునికి ఇంటికెళ్ళి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

ఐదు నియోజకవర్గాల

ఆకాంక్ష ఆదోని జిల్లా

- ఆదోని జిల్లా సాధన సమితి జేఏసీ
- 10న ఆదోని బంద్కు పిలుపు
- 22వ రోజు దీక్షలో రజకులు
- ఆదోనిలోనే కొనసాగించాలని కొన్ని గ్రామాల ఆందోళన
- నో ఎంట్రీ బోర్డులను ఏర్పాటు చేస్తామంటూ హెచ్చరిక



ర్యాలీగా వస్తున్న రజక సంఘం నాయకులు


దీక్షలో కూర్చున్న రజకులు


ఎల్లెల్సీ కాల్వ వద్ద ఆందోళన చేస్తున్న 16 గ్రామాల ప్రజలు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రాంత ఐదు నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ఆదోని జిల్లా కావడమేనని ఆదోని జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు లలిత, రఘురామయ్య, విరుపాక్షి, ఆదినారాయణ ఆశోకనందరెడ్డి అన్నారు. ఆదివారం కోట్ల కూడలిలో ఆదోని జిల్లా సాధన కోసం చేపట్టిన దీక్షలో రజకులు కూర్చున్నారు. ఈ దీక్షలు 22 రోజుకు చేరుకోవడంతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పశ్చిమ ప్రాంత నియోజకవర్గ పల్లెల్లో రైతులు, రైతు కూలీలు ఉపాధి లేక మహానగరాలకు వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు ప్రాజెక్టు నిర్మాణంలోనూ పాలకులు నిర్లక్ష్యం చూపడంతో పంటలు పండక వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఉన్నత చదువుల కోసం సరైన విద్యాసంస్థలు లేక మధ్యలోనే చదువులు ఆపే యాల్సిన పరిస్థితిఉందన్నారు. జిల్లా ఏర్పాటయితే పరిశ్రమలు విద్యాసం స్థలు ఏర్పాటై సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తారని అన్నారు.

10న ఆదోని బంద్..

ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసేందుకు ద్వారకా ఫంక్షన్ హాల్లో జిల్లా సాధన సమితి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి విద్యావేత్తలు పారిశ్రామికవేత్తలు, న్యాయవాదులు, కుల సంఘాలు, మేధావులు అన్ని రాజకీయ పార్టీ నాయకులు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈనెల 10న ఆదోని సంపూర్ణ బందుకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా బంద్లో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి చేద్దామని కోరారు. పాలక, ప్రతిపక్ష, ప్రజా సంఘాలు, యువజన, విద్యార్థి సంఘాలు ప్రతి ఒక్కరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీనివాసాచారి, ఫయాజ్ అహ్మద్, కోటి, సాయిప్రసాదు, తిరుమలేష్, సాయిరాం, చంద్రకాంత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సావిత్రి, రేణువర్మ ఆదినారాయణ, ఆధూరి విజయకృష్ణ కృష్ణమూర్తి, నాగరాజు గౌడ్, టీ వీరేష్ కుంకనూరు వీరేష్, దస్తగిరి, ఉదయ్, బండారి హనుమంతు పాల్గొన్నారు.

గళమెత్తిన గ్రామాలు

ఆదోని రూరల్ : తమ గ్రామాలు ఆదోని మండలంలోనే కొనసాగించాలని చిన్నహరివాణం,గొనేహాళ్, గణేకల్, సంతేకుడ్లూరు, నారాయణపురంతోపాటు మిగిలిన గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. మూకుమ్మడిగా చిన్నహరివాణం, గొనేహాళ్ గ్రామాల ప్రజలు ఆదివారం ఎల్లెల్సి కాల్వ ప్రధాన కాల్వ వద్దబైఠాయించారు. వీరికి 14గ్రామాల నాయకులు రాజకీయాలకతీతంగా వచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు గోపాల్రెడ్డి, గణేకల్ విరుపాక్షి, రామస్వామి, పొంపాపతి, రామకృష్ణారెడ్డి, మల్లికార్జున, మణిలు మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లో తమ గ్రామాలను పెద్దహరివాణంలో కలిపితే ఒప్పుకొనే ప్రసక్తే లేదన్నారు.

గ్రామాల్లో నో ఎంట్రీ బోర్డు ఏర్పాటు చేస్తాం ..

ఒక వేళ తమ గ్రామాలను పెద్దహరివాణంలో కలిపితే ప్రభుత్వం, పాలక నాయకులు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మా గ్రామాల్లోకి ఏ రాజకీయ నాయకుడు రాకుండా నో ఎంట్రీ బోర్డులను ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు.

ఆలూరు: వెనుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన కమిటీ నాయకులు కత్తి రామాంజినేయులు, అశోక్, రంజిత్, భూపేష్, అర్ధగేరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల మద్దతుతో ఈనెల 12న ఆలూరులో రిలే దీక్షలు చేపట్టేందుకు నిర్ణయించామన్నారు. ఇందుకోసం అందరి మద్దతు అవసరమన్నారు. ఈకార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు రాముయాదవ్, దర్గన్న, చంద్రకాంత్రెడ్డి, ఎల్లప్ప, నాయకులు దర్గన్న, తిక్కస్వామి పాల్గొన్నారు.

వాజ్పేయి విగ్రహావిష్కరణకు తరలిరావాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ


అధ్యక్షుడికి కేకు తినిపిస్తున్న గుమ్మనూరు నారాయణ, కమలమ్మ

ఆలూరు డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆలూరు బీజేపీ నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమెమాట్లాడుతూ బీజేపీకు ఆదరణ పెరుగుతుందని, ఇతర పార్టీల నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఈనెల 12న కర్నూలులో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పాయ్ విగ్రహ ఆవిష్కరణకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మార్కెట్యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్రంలో మోదీ, చంద్రబాబు, పవన్కళ్యాణ్ విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పచ్చారపల్లికి చెందిన వైసీపీ నాయకులు బీజేపీలో చేరారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ జన్మదినం సందర్భంగా కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గుమ్మనూరు నారాయణ, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్, అరికెర సర్పంచ్ నాగరాజు, మండల కన్వీనర్ బసవరాజు, బీజేపీ నాయకులు విట్టా రమేష్, తిమ్మప్ప, వెంకటరాముడు, శ్రీదర్, బసవరాజు, రవీంద్రస్వామి, విరుపాక్షిరెడ్డి, గోవింద్, వీరంజి, మంజు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్, కర్నూలు నగరంలో ఈనెల 12వ తేదీన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి విగ్రహావిష్కరణకు తరలిరావాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో అటల్ వాజ్పేయి, ప్రధాని మోదీ సుపరిపాలన నియోజకవర్గ సమావేశం కో కన్వీనర్ గోవర్ధన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలులో వాజ్పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. అలాగే వాజ్పేయి, మోదీ సుపరిపాలన పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో పరిపాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామగ్రామాన బీజేపీని బలోపేతం చేసేదిశగా పార్టీ శ్రేణులు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఉసేనప్పయాదవ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస ఆచారి, మండల కన్వీనర్ నరేష్ కిసాన్మోర్చా అసెంబ్లీ ఇన్చార్జి సి.సి.రంగన్న, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బ్రహ్మయ్య, గోరంట్లప్ప, కరణం చంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ

ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక


మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు గోనబావి గోపాల్

ఆదోని రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉప్పర సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా గోనబావి గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కర్నూలులోని బీసీ భవన్లో ఉప్పర సంఘం సమావేశం నిర్వహించి గోనబావి గోపాల్ను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘం హక్కుల కోసం సంఘం సభ్యుల అభ్యున్నతి కోసం పోరాడుతానన్నారు. ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, డాక్టర్ గిడ్డయ్య, మాజీ అధ్యక్షుడు దూదేకొండ రాముడు, జిల్లా ప్రధానకార్యదర్శి వీరేంద్ర, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఆదోని, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా ఆదోని పోలీసులు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేరచరిత్ర గల వారు, చెడునడత కలిగిన వ్యక్తులకు టూటౌన్ సీఐ రాజశేఖర్రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన రౌడీ షీటర్లతో మాట్లాడుతూ సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఐ రాజశేఖర్రెడ్డి హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను పోలీసులు ఉపేక్షించబోరని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

మద్దికెర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండంలోని ప్రతి ఇంటి యజమాని స్వర్ణ పంచాయతీలో భాగంగా తమ ఇంటి నెంబరుకు ఆధార్ ఫోన్ నెంబర్ ఆయా పంచాయతీ కార్యాలయాల్లో అనుసంధానం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ 2025-26 సంబంధించిన పన్నులు వంద శాతం వసూలు చేయాలన్నారు. గతంలో పెండింగ్లో ఉన్న పనులు కూడా ఈ ఏడాది వసూలు చేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచి అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే ప్రతి ఇంటి యజమాని ఆధార్, ఫోన్ నెంబరుతో వెళ్లి ఇంటి నెంబర్ లింక్ చేయించుకోవాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 98 శాతం పూర్తయిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి 2025-26 సంబంధించిన ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు.


విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయాలి

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న వివిధ నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని మండల విద్యాశాఖ అధికారి భూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ నిర్వహించిన ఇండోర్ జోనల్ స్థాయి క్రీడా పోటీలు హోరాహోరిగా సాగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో గోపాల్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం మానసిక ధృడత్వం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, ప్రశాంత్ గాంధీ, సునీల్ రెడ్డి, భరతుషా, శ్రీధర్ రెడ్డి, విట్ట మురళీధర్, రాయచోటి సుబ్బయ్య, పద్మనాభయ శెట్టి, సందీప్ రెడ్డి, హుస్సేన్ భాషా పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ఎనిమిదవ తరగతి విద్యార్థులకు స్కాలర్షిప్ అందించేందుకు నిర్వహించిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ఆదోని పట్టణంలోని తొమ్మిది కేంద్రాలలో ప్రశాంతంగా జరిగిందని డిప్యూటీ ఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. డివిజన్ 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులు 1913 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 75 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ. 18 వేలు కేంద్ర ప్రభుత్వం వారి ఖాతాలో ఏర్పాటు చేశామని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


సుహాసిని (ఫైల్)

వెల్దుర్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వివాహిత మహిళ మృతిచెందిన ఘటన వెల్దుర్తి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల మేరకు లక్ష్మీనగరం గ్రామానికి చెందిన సుహాసిని(32) శనివారం రాత్రి ఇంటిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన భర్త చంద్రశేఖర్ ఆటోలో వెల్దుర్తి సామాజి ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసంఅంబులెన్స్లో కర్నూలు సర్వజనవైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి తల్లి ఆవుల భాగ్యలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూమార్తెలు, ఒక కుమారుడు సంతానం కలరు.

పత్తి రైతులను ఆదుకోవాలి

దేవనకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్ని ఏపీ రైతుసంఘం మండల అధ్యక్షులు కండప్ప అన్నారు.ఖరీఫ్లో మండలంలో ప్రధాన పంటగా పత్తి సాగు చేయడం జరిగిందన్నారు. అధిక వర్షాల వల్ల పంట సరిగ్గ రాలేదని, వచ్చిన తడిసిపోవడంతో పంటలో తేమశాతం అధికంగా ఉందన్నారు., అధిక వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. రైతుసమస్యల పరిష్కరం కోసం ఈ నెల 10న ఆస్పరిలో రోడ్డు దిగ్బంధన కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ హాజరైతున్నట్లు, నియోజకవర్గంలోని రైతులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి దిగ్బంధన కార్యక్రమాన్ని జయప్రధం చేయాలన్నారు.

10న ఆస్పరికి సీపీఐ జాతీయ కార్యదర్శి రాక


జెండా ఊపి జీపుజాతాను ప్రారంభిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన ఆస్పరిలో చేపట్టే రోడ్డు దిగ్బంధన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రోడ్డు దిగ్బంధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ జీపుజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు దిగ్బంధన కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. పత్తి పంటను క్వింటాల్ రూ.12 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తిలో తేమశాతం 12 శాతం నుంచి 20 శాతానికి పెంచి సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పంటలు సాగుచేసి వర్షాలు, తుపాన్ల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఉల్లి, టమాటా, పత్తి, వేరుశనగ పంటలకు గిటుటబాటు ధరలు కల్పించాలన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కరించకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి, రమేష్, ఆంజనేయ, బడేసాబ్, ధనుంజయ, నల్లన్న, నాగరాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


సొసైటీ చైర్మన్కు వినతి పత్రం ఇస్తున్న సీఈవో నాయుడు

తుగ్గలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగస్థుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని మారెళ్ల అశోకా సొసైటీ సీఈవోలు మనోహర్ నాయుడు కోరారు. ఆదివారం సహకార సంఘం యూనియన్ పిలుపు మేరకు సహకార సంఘం వద్ద ధర్నా నిర్వహించి రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ వెలగపూడి సచివాలయం రిజిస్ట్రార్ అండ్ కోఆపరేటివ్ ఆర్సీఎస్ వారికి మెమోరాండాన్ని పంపించాలని సొసైటీ చైర్పర్సన్ వైవీ ప్రభాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆదివారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ మారెళ్ల సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎండీకి పంపించాలని కోరుతూ చైర్పర్సన్కు వినతి పత్రం అందించారు కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది మధుబాబు ఉన్నారు.

పంట తెగుళ్లతో జాగ్రత్త

తుగ్గలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శనగ పంటను ఆశించే తెగుళ్లతో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ మండల అధికారి సురేష్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన శనగ రైతులతో మాట్లాడుతూ మండలంలో దాదాపు 6వేల ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశారు. ఈ పంటను భూమి నుంచి వచ్చే తెగుళ్లు అధికంగా వాయపించి నష్టం కలుగజేస్తాయన్నారు. వేరుకుళ్లు తెగులు ఆశించి పంట మొత్తం పసుపురంగులోకి మారి గుంపులు గుంపులుగా మొక్కలు చనిపోతాయన్నారు. ఇలా అనేక రకాల తెగుళ్లు, చీడపీడల వల్ల పంటలు నష్టం కలగకుండా ఉండాలంటే ప్రాపినెబ్ అనే మందును (ఎంట్రాకాల్) ఎకరాకు 400 గ్రాములు లేదా సాఫ్ 400 గ్రాములు లేదా కుప్రోఫిక్స్ (కాపర్ సల్ఫేట్ 47.15 శాతం, మన్కోజెబ్ 30 శాతం) ఎకరాకు 400 గ్రాములు లేదా కోసైడ్ అనే మందును ఎకరాకు 250 గ్రాములు లేదా ట్రిడీయం అనే మందును ఎకరాకు 200 మిలీలీటర్లన లేదా టేబుకొనజోల్ అనే మందును ఎకరాకు 200 మీ.లీ లేదా ట్రైకోడర్మావీరిడే 2 కేజీలు మరియు సుడోమోనస్ 2కిలోలు ఉదయాన్నే 10 కిలోల ఇసుకలో కలిపి పిచికారి చేయాలన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న రఘునాథ్ రెడ్డి

మంత్రాలయం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కురువ చిన్న నాగుడు (35) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరుడు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి మృతదేహనికి నివాళి అర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. మట్టి ఖర్చులకు రూ.10 వేలు నగదును అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్ఎల్‌సీ చైర్మన్ నరసింహులు, హనుమంతు,రజాక్, గోపాల్,ఇశ్రాయేలు,బొజ్జప్ప,లింగ, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా తప్పదని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ఆయన కర్నూలు ప్రధాన రహదారిలో డ్రంక్‌అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమకు ఓ కుటుంబం ఉందని గుర్తించుకోవాలన్నారు. వాహనంపడితేవారు హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

ఆదోనిని జిల్లా చేయాల్సిందే : జేఏసీ



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

నందవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లా చేయాల్సిందేనని ఆదోని జిల్లా సాధన కమిటీ కోఆర్డినేటర్(జేఏసీ) కృష్ణ అన్నారు. ఆదివారం నందవరంలో ఆయన మాట్లాడుతూ ఆదోని జిల్లాగా చేయాలని ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ మంత్రాలయం నియోజకవర్గ ప్రాంతాలు విద్య వైద్య, సాగునీరు వాణిజ్య పరంగా అభివృద్ధిలోను వెనుకబడి ఉన్నాయన్నారు. ఆదోని అతి పెద్ద వ్యవసాయ మార్కెట్, చెన్నై ముంబాయి బ్రాడ్ గేజ్ లైన్, గుంతకల్లు, తుంగభద్ర స్టేట్ హైవే, ఒకప్పుడు రెండో ముంబాయిగా పేరొందిన ఆదోనిలో మిగతా 4 నియోజకవర్గాలు కలిపి జిల్లా చేస్తే అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఉదయ్, ఖాజా,రఘు, అఫ్రిద్ పాల్గొన్నారు.

పీపీపీ విధానానికి వ్యతిరేకంగా సంతకాలు



జగన్‌కు సంతకాలు చేసిన పుస్తకాలు అందజేస్తున్న మిట్టాసోమాపురం వైసీపీ నాయకులు

నందవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాసోమాపురం, కనకవీడు, పేట గ్రామాల వైసీపీ నాయకులు పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో సంతకాలు ముగిసిన పుస్తకాలను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి, జడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, శవాల బుజ్జిబాబు, పేట రామిరెడ్డి, ఈరన్న, హనుమం తు, మిట్టా సోమాపురం నరసింహులు, యాకోబు,శివ, లింగన్న పాల్గొన్నారు.

ఏఐకేఎస్ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఏఐకేఎస్ నాయకులు

పెద్దకడబూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరు సీపీఐ కార్యాలయంలో ఏఐకేఎస్ నూతన కమిటీని సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా షేక్ ఇస్మాయిల్, సహాయ కార్యదర్శిగా దస్తగిరిలను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి రూ.20వేల పరిహారం అందజేస్తామని చెప్పి రూ.5వేలు ఇచ్చి చేతులు దులపుకుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీరేష్, ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు అంజనేయులు, నాయకులు మహ్మద్ ఉసేన్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు



బాధిత కుటుంబానికి సరుకులను అందజేస్తున్న సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుబాల గ్రామానికి చెందిన నాయకంటి పెద్ద ఎర్రన్న అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి భార్య ఇద్దరు పిల్లలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతుండడంతో విషయం తెలుసుకున్న పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కమిటీ సభ్యులు, నాయకంటి సునీత, వ్యవస్థాపక అధ్యక్షులు సింగనేటి ప్రతిభ, భారతి, నరసన్న, సాతర్ల సల్మాన్ ఆదివారం వంద కేజీల బియ్యం, మంచినూనె, కారం పొడి, బెల్లం తదితర నిత్యావసర సరుకులను అందించారు.

మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.రామాంజనేయులు, ఎమ్మిగనూరు మండల సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు. బి.రాముడు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం మహాసభల వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగరాజు, రమేష్, సురేష్, నాగలక్ష్మి, ఉస్మాన్‌వలి, మంజుల, తిమ్మప్ప, గోపాల్, రాజు, బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమోదాలకు సై నిర్మాణాలకు నై



మూడు సార్లు కౌన్సిల్‌లో ఆమోదం పొందినా టెండరుకు రాని హెచ్‌బీఎస్ కాలనీలోని ప్రధాన రోడ్డు

● మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదం పొందినా..
● ముందుకు సాగని రహదారులు నిర్మాణాలు
● ఇబ్బందుల్లో ప్రజలు ● పట్టించుకోని అధికారులు



నారాయణ పాఠశాలకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా డ్రైనేజీ పైపు

ఎమ్మిగనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో రెండు ప్రధాన రహదారులు మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన అజెండాలో రెండు, మూడు పర్యాయాలు ఆమోదం పొందినా నిర్మాణాలకు నోచుకోకవడం లేదు. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం సీసీ రోడ్లు వేసినప్పటికీ అవి కాస్తా పాడైపోయి గుంతలు మయంగా మారిపోయాయి. యూజీడీ పైప్‌లైన్ వేసే సమయంలో రహదారుల మధ్యలో తవ్వి ప్యాచీలు వేయకుండా వదిలేశారు. దీంతో వర్షాకాలంలో రహదారుల మధ్యలో గుంతల్లో నీరు నిలిచి రహదారి గుంతలమయంగా మారింది. దీంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

● రెండు, మూడు సార్లు కౌన్సిల్‌లో ఆమోదం పొందినా..

హెచ్‌బీఎస్ కాలనీలోని గాయత్రి దేవి ఆలయం రోడ్డు పునఃనిర్మించేందుకు దాదాపు రూ. 30లక్షలతో గత ఏడాదిలో రెండు సార్లు మున్సిపల్‌కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన అజెండాల్లో ఆమెదం పొందింది. అలాగే పార్కు రోడ్డు నుంచి పిరమిడ్ ధ్యానకేంద్రానికి వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా వేయాలని రూ. 50లక్షలతో మూడు సార్లు కౌన్సిల్ సమావేశాల్లో ఆమోదం పొందింది. కొత్త రోడ్డు నిర్మించేందుకు రెండు మూడు సార్లు ఆమోదం పొందినా అధికారుల నిర్లక్ష్యంమో.. లేక పాలకుల పట్టించుకోకపోవటం వంటి కారణాలతో నేటికి రోడ్లు నిర్మాణాలకు నోచుకోలేదు.

ఇదిలా ఉండగా ఆదే కాలనీలో గీతా మందిరం వెనుక రోడ్డుతో పాటు మరో రెండు రోడ్లు వేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కాంట్రాక్టర్ సైతం పనులు ప్రారంభించి కొంతమేర పనులు చేసి వదిలేశారు. ఈ పనులు నిలిచిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రహదారుల నిర్మాణాలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..



మసీదుపురం గ్రామ ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గుంత

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్లు గ్రామంలోని పిండిగిర్నీ సమీపంలో ఉన్న మలుపు వద్ద ప్రధాన రహదారి ఓవైపు కుంగిపోయింది. గ్రామంలో రోడ్డు చిన్నదిగా ఉండడమేగాక ఎదురెదురుగా ఏ వాహనం వచ్చినా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గుడికల్లు గ్రామం మీదుగా బెంగళూరు, అనంతపురం, కడప తదితర సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం ఈ దారి గుండానే ప్రయాణం చేస్తుంటారు. అలాగే మసీదుపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి దర్శనార్థం గ్రామానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.



గుడికల్లు గ్రామంలో మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ



ప్రత్యేక అలంకరణలో రాఘవరాయల బృందావనం



భరత నాట్యం చేస్తున్న బెంగళూరు కళాకారులు

మంత్రాలయం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ చేశారు. ఆదివారం మార్గశిర తదియ శుభ దినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు.

రాఘవేంద్రస్వామి మఠంకు రూ.లక్ష విరాళం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి చెన్నైకు చెందిన సర్వేశ్వర రావు అనే భక్తుడు రూ.లక్ష దైనందికసేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోణాపూర్‌లు తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష చెక్‌ను విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీపాధాచార్, జేపీ స్వామి పాల్గొన్నారు.

అలరించిన భరత నాట్య నృత్య ప్రదర్శన

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలోని యాగశాలలో బెంగళూరుకు చెందిన కావ్యదిలీప్ రచనడాన్స్ అకాడమి ఆధ్వర్యంలో 50 మంది కళాకారులచే నిర్వహించిన భరతనాట్యం అలరించింది. ఆదివారం యాగశాలలో సాంప్రదాయక భరతనాట్యం నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈనృత్యాలను కనులార తిలకించిన పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు కళాకారులకు నగదు,శేషవస్త్రం,ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ మాధవ శెట్టి, మఠం మేనేజర్లు శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, అనంతపు రాణిక్, జేపీస్వామి, పద్మనాభాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్ పాల్గొన్నారు.

మాచాని రాజేంద్రప్రసాద్ మృతి



మాచాని రాజేంద్రప్రసాద్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచాని రాజేంద్రప్రసాద్ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ కేంద్ర సహాయ మంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ఎమ్మిగనూరుకు చేరుకుని మాచాని రాజేంద్రప్రసాద్ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాచాని రాజేంద్రప్రసాద్ చేసిన సేవలను గుర్తు చేశారు. వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ మాచాని రాజేంద్రప్రసాద్ పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాచాని రాజేంద్రప్రసాద్ చేనేత క్లస్టర్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. మృతుడు మాచాని రాజేంద్రప్రసాద్ ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మశ్రీ మాచాని సోమప్పకు మనవడు కాగా, కర్నూలు మాచాని సోమన్న కుమారుడు. పలువురు రాజకీయ ప్రముఖులు ఎమ్మిగనూరుకు చేరుకుని మాచాని రాజేంద్రప్రసాద్ పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు



పల్లెపాడులో మంటల్లో కాలిపోతున్న గడ్డివాము

కోసిగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో ఉప సర్పంచ్ యర్నాల తోట జింకల రామాంజనేయులుకు సంబంధించిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారనీ బాదితుడ రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం తెల్లవారుజామున రూ.20వేలు విలువ చేసే గడ్డివాముకు కొందరు గిట్టని వ్యక్తులు నిప్పు పెట్టి నష్టం కలిగించారనీ బాదితుడు ఉప సర్పంచ్ రామాంజనేయులు అన్నారు. స్థానిక రైతులు స్పందించినా అప్పటికే గడ్డివాము పూర్తిగా మంటల్లో కాలిపోయింది. తనను గిట్టనివారే ఈ ఆఘాయిత్యానికి పాల్పడ్డారనీ వాపోయారు.

కోసిగయ్య గుడి నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు



పూజలందుకుంటున్న స్వామివారు



కోసిగయ్య స్వామి దేవాలయం

కోసిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో ఊరి దేవుడిగా పిలువబడే కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి) కోసిగయ్య గుడి పునః నిర్మాణాన్ని నిర్మించేందుకు రూ.1.50 కోట్ల నిధులు మంజూరైనట్లు మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలయ ఈవో సాయికుమార్ ఆదివారం తెలిపారు. ఈ నిధులతో పాటు ఆలయానికి సంబంధించిన మరిన్ని నిధులతో కోసిగయ్య గుడి పునఃనిర్మాణం నిర్మించేందుకు త్వరలోనే పనులు చేపనున్నారు. ప్రస్తుతం కోసిగయ్య గుడి శిథిలావస్థకు చేరి ఆలయ గోపురం పైపెచ్చులు ఊడి పడుతున్నాయి. గత ఐదేళ్లుగా కోసిగి ప్రజలు నూతన ఆలయ పునఃనిర్మించాలని నాయకులను కోరినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేవాలయాల అభివృద్ధికి అడుగులు వేసింది. కోసిగయ్య గుడికి సంబంధించి సుమారు 250కి పైగా తేరుబజారు మైదానంలో దుకాణాలు ఉన్నాయి. నెలకు రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. ఆలయ ఈవో సాయి కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆలయ పునఃనిర్మాణానికి ప్రభుత్వం నుంచి ప్రస్తుతం రూ.1.50 కోటి నిధులు మంజూరు చేయించారు. ప్రభుత్వానికి ప్రజలు కృజత్ఞతలు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతియేటా డిసెంబర్‌లో విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు హాజరై తమ తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ముసురు ముంచింది!

● మిరప నాటినప్పటి నుంచి వదలని వర్షాలు
● రంగు మారుతున్న మిర్చి
● మూడేళ్ల నుంచి పంట దిగుబడి అంతంత మాత్రమే
● ఏటా తీవ్రంగా నష్టపోతున్న రైతులు



గోనెగండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ముసురు కమ్ముకోవడంతో మిరప రైతు విలవిలలాడుతున్నాడు. చేతికి అందే మిరప పంట దెబ్బతింటుంది. ఉదయం పూట ఎక్కువ మంచు కురుస్తుండడంతో పొలాల్లో ఆరవేసుకున్న మిరప పంట తడిసిపోతుంది. టార్పాలిన్లతో కప్పి అరబెట్టు కుంటున్నారు. అయినా మిరప మంచుకు తడవడంతో రంగు మారిపోతుంది. దీంతో ధర తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు బూడిదతెలుగు సోకడంతో పూత, కాయ రాలిపోవడంతో పాటు కాయ కూడా తెల్లగా మారుతుంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా లాభం లేకుండాపోతుందని రైతులు వాపోతున్నారు. గత మూడేళ్ల నుంచి మిరప పంట దిగుబడులు అంతంతం మాత్రమే ఉందని రైతులు వాపోతున్నారు.



గోనెగండ్లలో రంగు మారిన మిర్చి



గోనెగండ్లలో బూడిద తెగులు సోకిన మిరప పంట

మండలంలో దాదాపు 4000 ఎకరాల మేర మిరప పంటను సాగు చేశారు. మిరపకు గిట్టుబాటు ధర కూడా లభించడం లేదని రైతులు వాపోతున్నారు. రంగు మారిన మిరప క్వింటం ధర కేవలం రూ. పది వేల లోపే పలుకుతుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. బడేసా నాయుడు అనే రైతు రెండు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాడు. పొలంలో ఆరబోసుకున్న మిరప పంట నాలుగు రోజులుగా పంట మంచుకు తడిసి పోయింది. రంగు కూడా మారింది. ఎకరంకు దాదాపు లక్షరూపాయల మేర పెట్టుబడులు పెట్టి పంట పండిస్తే పంట చేతికి అందే సమయంలో ముసురు నష్టాల పాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ముసురు మిరప, కంది, వేరుశనగ పంటలను నాశనం చేస్తోందని రైతులు వాపోతున్నారు.